విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-భీమవరం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో ప్రధానంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయకూడ దని నిర్ణయం తీసుకుందన్నారు. నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా అన్ని రకాల ప్రజా వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. తహసీల్దార్, ఎంపీడీవోలతో సహా వివిధ మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జూలై 1 నుంచి సచివాలయాల వారీగా ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. వాలంటీర్లతో పాటు సచివాలయాల సిబ్బంది ఈ నెల 24 నుంచే ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం గురించి వివరిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయా గ్రామ సచివాలయాల భవనాల్లోనే ఈ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏ రోజు ఏ సచివాలయం పరిధిలో క్యాంపు నిర్వహిస్తున్నారో ముందస్తుగా అందరికీ తెలిసేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల్లో 11 సర్వీసులకు ఎలాంటి సర్వీసు చార్జీలు ఉండవని ఆమె పేర్కొన్నారు. ప్రజలు వద్దకే వస్తున్న ఈ సర్వీస్ లను ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆ ప్రకటనలో తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ ఇంటిపై ఏసీబీ దాడులు

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ,, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ ఇళ్లపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం 6 గంటల నుండి సాయం త్రం 6 గంటల వరకు తనిఖీలు నిర్వహించగా మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ కు సంబంధించి కొన్ని అక్రమ ఆస్తుల గుర్తించామని కృష్ణాజిల్లా ఏసీబీ డిఎస్పి బి. శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. మొత్తం తొమ్మిదిచోట్ల దాడులు నిర్వహించిన గా తణుకులో రెండు ఇల్లులు, మూడున్నర ఎకరాల పొలం, పాలకొల్లులో ఒక ఫ్లాటు, ఒక సైటు, భీమవరంలో ఒక ఇల్లు, విజయవాడలో మూడు అపార్ట్మెంట్లలో ఫ్లాట్లు, రూ 20 లక్షల 67 వేల 700 రూపాయల నగదు 430 గ్రాముల బంగారం , కుమార్తెకు గిఫ్టుగా ఇచ్చిన 263 గ్రాములు బంగారం, రెండు కేజీలన్నర వెండి , గృహాలలో వస్తువులు విలువ ఆరు లక్షలు, నాలుగు కార్లు, రెండు మోటార్ సైకిళ్ళను గుర్తించామని. విజయవాడలో మరొక ఇంటిని తనిఖీ చేయాల్సి ఉందని మరో రెండు రోజులు పాటు తనిఖీలు నిర్వహిస్తామని ఏసీబీ డిఎస్పి బి. శ్రీనివాస్ తెలిపారు.

కలిదిండి ఎస్ఐగా ప్రియ కుమార్

విశాలాంధ్ర - కలిదిండి : కలిదిండి పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా ప్రియ కుమార్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సిసిఎస్ లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై కలిదిండి పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ గా వచ్చినట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల యోగా విన్యాసాలు

విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : తొమ్మిదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. నేటి ఒత్తిడితో కూడుకున్న జీవన విధానంలో యోగాసనాలు యొక్క ఆవశ్యకత ను విద్యార్థులు వివరించారు. అంతకు ముందు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి యోగాసనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యత గురించి చాన్సర్ వివరించారు. ఈ కార్యక్రమంలోఎన్ సీ సీ, ఎన్ఎస్ఎస్, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు, నూజివీడు ఏవో ప్రదీప్ అకాడమిక్ డీన్ లక్ష్మణ్, పిఆర్ఓ సురేష్ బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

యాసిడ్ దాడిలో గాయపడ్డ మహిళ మృతి

విశాలాంధ్ర - దెందులూరు: యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన మహిళ వారం రోజులుగా మృత్యువుతో పోరాడుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది.వైద్యులు చేసిన కృషి ఫలించక చివరకు ప్రాణాలు విడిచింది. దీనితో ఆమె స్వగ్రామమైన దెందులూరులో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. ఈ నెల 13న ఏలూరు విద్యానగర్ లో ఉంటున్న ఎడ్ల ఫ్రాన్సిక అనే మహిళపై ముగ్గురు వ్యక్తులు అమానుషంగా యాసిడ్ దాడి చేసిన సంఘటన తెలిసిందే.. ఈఘటనలో బాధితురాలు మణిపాల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందింది. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం అనంతరం ఆమె స్వగ్రామమైన దెందులూరు లో అంతిమ కార్యక్రమాలకు ఏర్పాటు చేశారు.ఫ్రాన్సిక పార్థివ దేహాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి వారి కుటుంబ సభ్యులరె ఓదార్చి ఆర్థిక సాయం చేశారు. ధైర్యం చెప్పి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్సిపి అండగా ఉంటుందని భరోసా కల్పించారు.దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. దోషులను కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భవిష్యత్తుకు గ్యారంటీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- ముసునూరు: భవిష్యత్తుకు గ్యారంటీ వాల్‌పోస్టర్‌ను టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ముసునూ రు మండల టిడిపి నాయకులు విడుదల చేయించారు. బుధవారం మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు,కాట్రేనిపాడు గ్రామ పార్టీ నాయకులు రాపర్ల బాలకృష్ణ లు పాల్గొన్నారు. 23వ తేది నూజివీడు నియోజకవర్గంలో తుక్కులూరు, బత్తుల వారిగూడెం గ్రామంలో జరుగు కార్యక్రమంలో నూజివీడు డివిజన్ నాల్గు మండలాల టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొనాలని రఘుబాబు తెలిపారు.

వల్లంపట్ల మాజీ సర్పంచ్ సుభద్ర మృతి

విశాలాంధ్ర-టీ నరసాపురం: వల్లంపట్ల మాజీ సర్పంచ్ సామంతపూడి సుభద్ర(75) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఈమె 1995 వ సంవత్సరం నుండి 2000వ సంవత్సరం వరకు సర్పంచ్ గా పని చేసారు. ఆమె మృతి పట్ల జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు ,మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్ బాబు,తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అప్పగించారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ

విశాలాంధ్ర-భీమవరం: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాన్ని అభ్యసించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక విష్ణు కాలేజ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత విష్ణు కాలేజ్ ఆడిటోరియంకు విచ్చేసిన కేంద్ర మంత్రి డా.భారతి ప్రవీణ్ పవార్ కు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పుష్ప గుచ్ఛాన్ని అందజేసే స్వాగతం పలికారు. అనంతరం విష్ణు కళాశాల వ్యవస్థాప కులు బివి రాజు దంపతుల చిత్రపటాల ముందు పుష్పాలను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి డా.భారతి ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఏటా జూన్ 21న జరుపుకుంటున్నామన్నారు. 2014లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో మన ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో యోగాను "మన ప్రాచీన సంప్రదాయం నుండి అందిన అమూల్యమైన బహు మతి"గా పేర్కొనడం జరిగిందన్నారు. 193 మంది సభ్యులున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో తన మొదటి ప్రసంగంలో. "అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్వీకరించేందుకు కృషి చేద్దాం" అని నరేంద్ర మోదీ ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఈ ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించింది, అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాటుకు దారితీసిందని, యోగా ద్వారా ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండడానికి భారతదేశం ఆచరణాత్మక విధానం అన్నారు. దీనిని ప్రజలకు తెలియపరిచి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కల్పించినది మన ప్రధాన మంత్రి అన్నారు. యోగా సాధన వల్ల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను ప్రోత్సహించడం ప్రపంచ యోగా దినోత్సవం యొక్క లక్ష్యం అని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యోగా భారత ప్రాచీన వారసత్వంలో ఒక భాగం అన్నారు. ఇది మానవాళికి పూర్వీకులు ఇచ్చిన బహుమతి అని తెలిపారు. మనస్సు, శరీరం మధ్య సామరస్యాన్ని తీసుకురావడానికి యోగా పనిచేస్తోందన్నారు. మన శక్తిని మరింత సమర్థవంతంగా ఎలా ఉపయోగించాలో చెబుతుందని. మనసు ప్రశాంతంగా ఎలా ఉంచుకోవాలో కూడా నేర్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో దాసిరాజు, ఆయుష్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వెంకటకృష్ణ, బిజెపి స్టేట్ సెక్రటరీ బి. హెచ్ శ్రీనివాస వర్మ, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను కూల్చితే చావడానికైనా సిద్ధం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని నాగులగూడెం గ్రామంలో బుధవారం ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది.ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న తమ ఇళ్లను కూల్చి వేస్తే చావడానికైనా సిద్ధమేనని పెట్రోల్ డబ్బాతో జెసిబి కి అడ్డుగా నిలిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 20 సంవత్సరాల నుండి నాగులగుడెం లోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో తాటాకు ఇళ్ళు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని,తమకు ప్రభుత్వం వేరే చోట ఇళ్ళు నిర్మించి ఇచ్చేంత వరకూ ఇక్కడ ఖాళీ చేయమని రోడ్డుపై బైఠాయించారు.నాగులగూడెం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి జి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పోరంబోకు భూమిని నాగుల గూడెం గ్రామస్థులు కొంతమంది ఆక్రమించి ఇళ్ళు నిర్మించుకున్నారని రెవెన్యూ,పంచాయతీ నుండి నోటీసులు జారీ చేశామని, సిసి ఎల్ కోర్ట్ ఆదేశాలను కూడా ఆక్రమణ దారులు పాటించక పోవడం వల్ల వెంటనే ప్రభుత్వ భూమిలో ఉన్న ఇళ్లను తొలగించాలని జిల్లా కలెక్టర్, డి.పి.ఓ ఆదేశాల మేరకు తొలగించడానికి వచ్చినట్లు తెలిపారు.రాత్రి 7 గంటలు దాటే వరకూ బాధితులు అధికారుల పనులు జరగకుండా రోడ్డుపై బైఠాయించారు. జంగారెడ్డిగూడెం డి. టి. రమేష్, జంగారెడ్డిగూడెం ఈఓ పిఆర్డీ సునీల్,ఎస్సై ఉమా మహేశ్వర రావు, రెవెన్యూ,పోలీస్,పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగిలి వలంటీర్ మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని పంగిడిగూడెం గ్రామం లో వాలంటీర్‌గా పని చేస్తున్న కుక్కల రామాంజనేయులు (29) వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు.గత ఐదు రోజుల క్రితం వడదెబ్బతో అస్వస్థతకు గురవడంతో కుటుంబీకులు, ఆ గ్రామ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు రామాంజ నేయులును రాజమండ్రిలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చేర్చారు.పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.మృతుడు రామాంజనేయులు పంగిడిగూడెంలో జరిగే వివిధ సేవా కార్యక్రమాలలో ముందు ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు.చిన్న వయస్సులోనే అకాల మరణం చెందడంతో కుటుంబ సభ్యులు,గ్రామస్థులు శోక సంద్రంలో మునిగిపోయారు.

అభయారణ్యంలో అడ్డగోలు తవ్వకాలు

పత్తాలేని అటవీ సిబ్బంది

విశాలాంధ్ర-మండవల్లి: దేశఅత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు భేఖాతరు చేస్తూ కొల్లేరు అభయారణ్యంలో అక్రమ తవ్వకాలకు బడా బాబులు బరితెగించేశారు. కాంటూరు ప్లస్5 పరిధిలో మణుగునూరు గ్రామంలో పదుల సంఖ్యలో ప్రొక్లెయిన్లతో కొల్లేరులో అక్రమ చెరువులను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. కొల్లేరును పరిరక్షించాల్సిన అటవీశాఖ అధికారులు రాజకీయ నాయకుల వత్తిళ్లకు తలొగ్గుతూ కాసులు దండుకుని అక్రమాల వైపు కన్నెత్తి చూడటం లేదు. పెదెడ్లగాడి వంతెన సమీపంలోనే తవ్వకాలు జరుగుతున్నా అడ్డుకోవాల్సిన అధికారులు చరవాణిలను సైతం పక్కన పెట్టేసి అక్రమ దందాలకు సహకరిస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం మణుగునూరులో అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు మంగళవారం నుండి జరుగుతున్న తవ్వకాలను అడ్డుకోక పోవటంతో నగదు లావాదేవీలు పెద్దఎత్తున జరిగాయనే వాదనలు వినవస్తున్నాయి. చిత్తడి నేలలను పరిరక్షించటానికి చట్టాలున్నా అవి మాచుట్టాలే అన్నట్లు రాజకీయ నేతలు వ్యవహరిస్తున్నారు. మిగిలిన లంక గ్రామాల్లోను తాగునీటి చెరువుల పేరుతో తవ్వకాలు జరిపేందుకు నాయకులు రంగం సిద్ధం చేస్తున్నారు. మీడియాలోను కొల్లేరులో జరిగే అక్రమ దందాలు బయటకు పొక్కకుండా కైకలూరు పట్టణంలో ఓ లాడ్జిలో తాయిలాలు పంచిపెట్టి నట్లు ఇటీవలి వదంతులు వెల్లువెత్తాయి. కొల్లేరులో జరిగే అక్రమ తవ్వకాలు, మండలంలో అడ్డగోలుగా జరిగే చెరువుల తవ్వకాలు, మట్టితోలకాలపై ప్రముఖ పత్రికల్లోను వార్తలు రాకపోవటం శోచనీయం.

మహిళా ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-తణుకు: విశాఖపట్నంలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పరిపూర్ణానంద స్వామిజీ పై చర్యలు తీసుకుని మైనర్ బాలికకు న్యాయం చేయాలని కోరుతూ విశాఖలో ఉద్యమిస్తున్న మహిళా నాయకురాలు రాధపై అన్యాయంగా చేయి చేసుకున్న మహిళా ఎస్.ఐ. పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. బుధవారం తణుకు వెంకటేశ్వర థియేటర్ సెంటర్లో సీపీఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన,ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా ధర్నా నుద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ మాట్లాడుతూ న్యాయం కోరుతూ శాంతియుతంగా ఉద్యమిస్తున్న మహిళలపై పోలీసులు తీరు సిగ్గు చేటన్నారు. మహిళా నాయకురాలిపై అకారణంగా చేయిచేసుకున్న మహిళా ఎస్.ఐ.ను విధుల నుంచి బహిష్కరించడంతో పాటుగా ఆమెను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ఇప్పటికైనా మైనర్ బాలికపై పలుమార్లు బెదిరించి అత్యాచారానికి పాల్పడిన స్వామిజీని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, కలిశెట్టి వెంకట్రావు, సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి, పార్టీ జిల్లా నాయకులు ఎం.సీతారాం ప్రసాద్, కళింగ లక్ష్మణరావు, నామాన వెంకటేశ్వరరావు, మండల నాగేశ్వరరావు,పూసరపు వెంకట్రామరాజు,ఎం. లక్ష్మీపతి,తమరాని శ్రీను, గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు తదితరులు నిరసన ప్రదర్శన, ధర్నాకు నాయకత్వం వహించారు.

ప్రధాని మోడీ వల్లే భారతదేశం అగ్రగామి

- కేంద్రమంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : ప్రధానమంత్రి మోడీ వల్లనే ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా నిలిచిందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా లో రెండు రోజుల పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి భీమవరం భీమవరం. ఆస్పత్రిలో మేధావులు, డాక్టర్లతో సమావేశం అయ్యారు. అనంతరం మాట్లాడుతూ 9 సంవత్సరాల బిజెపి పాలన, అంతకుముందు పరిపాలనను బేరీజు వేసుకుంటే ప్రధానమంత్రి మోడీ ప్రజల ఆరోగ్యం కోసం వారి భద్రత కోసం ఏ విధంగా శ్రద్ధ తీసుకున్నారో గుర్తించవచ్చని అన్నారు. కేంద్రమంత్రి. బిజెపి అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల పాలనలో దేశవ్యాప్తంగా 648 మెడికల్ కాలేజీ లను ఏర్పాటు చేయడం జరిగిందని, లక్ష వరకు ఎంబీబీఎస్ సీట్లను అదనంగా పెంచడం జరిగిందని, కరోనా సమయంలో దేశవ్యాప్తంగా 220 కోట్ల వ్యాక్సిన్ ఉచితంగా ప్రజలకు వేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డి.మహేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాస్ వర్మ,డాక్టర్ గోపాల రాజు, డాక్టర్ కృష్ణ కుమార్, డాక్టర్ ఇరింకి శ్రీలక్ష్మి బిజెపి నాయకులు పాక సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిం చాలని టి నరసాపురం సర్పంచ్ మొదుగు సునంద తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థినులను బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు బి. లింగస్వామి, విద్యాకమిటీ చైర్మన్ పుట్టాల నాగేశ్వరరావు, ఎంపిటిసి నార్లపాటి వెంకటేశ్వరరావు,దేవరపల్లి సీతా రామ ప్రసాద్,కన్నం సర్వేశ్వర రావు, ఉపాధ్యాయులు ఆర్ వి జి కృష్ణా రావు, కె కుటుంబరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



విలువైన ప్రభుత్వ స్థలాలు నిరుపయోగం

- పట్టించుకోని అధికారుల తీరుపై విమర్శలు
- స్థలాలను ఉపయోగంలోకి తేవాలని వినతి

విశాలాంధ్ర - లింగపాలెం : మేజరు పంచాయతీ ధర్మాజీగూడెంలో ఎంతో విలువ గల ప్రభుత్వ స్థలాలు నిరుపయోగంగా ఉండటమే కాక ఆక్రమణల బారిన పడుతున్నాయి. వీటి గురించి అధికారులెవ్వరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. కొంత స్థలం ఆక్రమణలకు గురవుతుంటే, ఈ స్థలాల్లో కట్టిన కట్టడాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. ఈ స్థలాలకు పట్టిన దుస్థితి చూసి ప్రజలు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు స్థలాలకు ఉన్న డిమాండు, విలువ తెలిసిందే. ఈ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న స్థలాల విలువ కోట్ల రూపాయల్లో ఉంటుంది. ప్రధాన రహదారి ప్రక్కన ప్రధాన సెంటరులో దాదాపు వెయ్యి గజాలు ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఇవి రెవెన్యూ, పంచాయితీరాజ్, కేంద్ర ప్రభుత్వానికి కేటాయించిన స్థలాలు. అంతేకాకుండా రహదారి బంగ్లా ఉన్న ప్రాంతంలో బంగ్లాను పడగొట్టి లక్షలు ఖర్చుపెట్టి బస్టాండు నిర్మించారు. ఇది బస్సులు వెళ్ళేందుకు వీలులేని స్థలం. దాదాపు పాతికేళ్ళ క్రితం అప్పుడున్న రాజకీయ పరిస్థితులలో కేవలం ఒకరిద్దరి మాటలకు విలువ ఇస్తూ గాంధీ సందర్శించిన రహదారి బంగ్లాని కూలగొట్టి ఈ ప్రాంతంలో బస్టాండు నిర్మించారు. అప్పట్లోనే దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా రాజకీయ ఒత్తిళ్ళతో అధికారులు మొండిగా వ్యవహరించారు. ఇప్పుడు ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఈ ప్రాంతాన్ని ఉపయోగంలోకి తీసుకురావటానికి సంత ఏర్పాటు చేయాలని ప్రజలు మొరపెడుతున్నా అధికారులు చలనం లేనట్లుగా ఉంటున్నారనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. గ్రామంలో పాతబస్టాండ్ ప్రాంతంలో విస్తారమైన స్థలం ఉంది. 1941లో ఈ ప్రాంతంలో విలేజి సావిడిని నిర్మించారు. ఇప్పుడు ఇది శిథిలమైంది. ఈ స్థలంలోకి వెళ్ళేందుకు వీలు లేకుండా ఆక్రమణలు జరిగాయి. ఈ ప్రాంతంలో ఆయుర్వేద ఆసుపత్రికి భవనం నిర్మించారు. ఇది ఎప్పుడూ తెరుచుకోదు. కొత్తబస్టాండ్ ప్రాంతంలో పోస్టాఫీసు కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించారు. దీని చుట్టూ ఆక్రమణలు అడ్డుగా ఉన్నాయి. గ్రామంలో ఆక్రమణల సమస్య తలనొప్పిగా ఉంది. అడ్డగోలు ఆక్రమణల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండు స్థలమంతా ఆక్రమణలపాలైంది. ఆక్ర మించుకున్న స్థలాలను లక్షల్లో క్రయ విక్రయాలు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకుని దుకాణాల సముదాయాన్ని నిర్మిస్తే ఆక్రమణదారులు వీటిలో అద్దె చెల్లిస్తూ వ్యాపారాలు చేసుకుంటామని అంటున్నారు. దుకాణాల సముదాయం కాకపోతే రైతులకు ఉపయోగపడే విధంగానైనా ఈ స్థలాలను తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు

విశాలాంధ్ర-ఉంగుటూరు : ప్రభుత్వ సేవలు పూర్తి సంతృప్తి స్థాయిలో ప్రతి కుటుంబానికి అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీ లక్ష్మి అన్నారు. బుధవారం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులకు ప్రజాప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రమణ మాట్లాడుతూ.. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి కోరిపల్లి జయలక్ష్మి, తాహసిల్దార్ ఏవి రమణారావు, ఇంచార్జ్ ఎంపీడీవో ఆంజనేయులు, మండల సచివాలయ కన్వీనర్ డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, మండల ఎంపీటీసీ సభ్యులు బండారు నాగరాజు, ఈవోపీఆర్డి షేక్ సంషిద్దీన్ లు పాల్గొన్నారు.

వెలవెలబోయిన సమావేశం

విశాలాంధ్ర-ఉంగుటూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం కోసం బుధవారం ఏర్పాటు చేసిన సమావేశం వెలవెల బోయింది. ప్రజా ప్రతినిధులు, దిగువ స్థాయి అధికారులు రాలేదు. దీంతో జగనన్న సురక్ష కార్యక్రమం సమావేశం బోసిపోయి ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సర్పంచులు ఒకరిద్దరు తప్ప మిగతా వారు హాజరు కాకపోవటంతో మొక్కుబడిగా ముగించారు. ఈనెల 23న ఇంటింటికి వాలంటరీ సచివాలయం వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి, వారి సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అధికారులు సమావేశంలో పేర్కొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతాంగం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం సార్వా సీజన్ ప్రారంభమై రైతులందరూ దుక్కులు, దమ్ములు చేయడం, ఆకుమడులు వేసుకోవడం వంటి వ్యవసాయ పనులలో నిమగ్నమ య్యారు. రైతులు ఈ వారం వరి పంటలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు గురించి ఉంగుటూరు ఏవో బాలిన వెంకటేష్ వివరించారు.

ఆకుమడిలో చేయవలసిన పనులు : ఒక ఎకరా వరి పొలం ఊడుపు ఊడ్చడానికి 5 సెంట్ల నారుమడి వేసుకోవాలి. దమ్ము చేసిన నేలలో 10 మీ. పొడవు 1 మీ. వెడల్పుతో నారుమడిని చేసుకోవాలి. నారుమడిలోని నీరు పోషకాలు బయటపోకుండా ఉండేలా గట్లు వేసుకోవాలి. గట్టును సమంగాను గట్టిగాను పోయాలి. మడిలో చెతాచెదారం లేకుండా జాగ్రత్తపడాలి . నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్తపడాలి.

నారుమడి లో ఎరువుల యాజమాన్యంలి : 5 సెంట్ల నారుమడిలో 2 కిలోలు నత్రజని(1 కిలో విత్తనం చల్లేముందు,మరో కిలో విత్తిన 12 రోజులకు), 1 కిలో భాస్వరం మరియు 1 కిలో పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి. సస్యరక్షణ కాండం తొలుచు పురుగు నివారణ కొరకు 5 సెంట్ల నారుమడి లో 800 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి. కాండం తొలిచు రెక్కల పురుగులు గ్రుడ్లను కొసల మీద పెడుతుంది కావున నారు నాటేటప్పుడు కొసలు విరిచి నాటాలి. దీనితో గ్రుడ్లను నిర్మూలించవచ్చు.

ఉంగుటూరు డిప్యూటీ తహసీల్దార్‌గా దుర్గాప్రసాద్

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు డిప్యూటీ తహశీల్దారుగా బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భీమడోలు సివిల్ సప్లై గోదాములో డీటీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఉంగుటూరు డీటీగా వచ్చారు. బొడ్డేపల్లి గతంలో ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయంలో ఆర్ఐ గా పనిచేశారు. స్వగ్రామం ఉంగుటూరు మండలం నారాయణపురం. సొంత మండలానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రసాద్ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అనేక అవార్డులు పొందడం జరిగింది. డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌ను కార్యాలయ సిబ్బంది కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

పాస్టర్‌కు ప్రజాసంఘాల మద్దతు

విశాలాంధ్ర - చాట్రాయి: సర్పంచ్ కాళ్ళు పట్టుకుంటేనే నీళ్ళు ఇస్తారంట అనే శీర్షికతో విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ప్రజాసంఘాలు స్పందించాయి. చాట్రాయి మండలం కృష్ణా రావుపాలెం గ్రామంలో గత ఎనిమిదేళ్ళగా సెవెంత్ డే చర్చిలో పాస్టర్ గా సేవలు అందిస్తున్న విజయరావు తాను ఇల్లు కట్టుకోడానికి నీళ్ళ కుళాయి అనుమతి ఇవ్వమని అడగటానికి వెళితే పరుషపదజాలంతో మాట్లాడారని వీడియో ద్వారా తెలియజేయడం పత్రికల్లో కథనం రావడంతో బుధవారం చాట్రాయి మండలం సీఐటీయూ మండల కార్యదర్శి కె.భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం. హెూలీమేరీ పాస్టర్ కుటుంబ సభ్యులతో కలసి మండల పరిషత్ కార్యాల యంకు వచ్చి సూపరింటెండెంట్ ఎన్.మురళీమోహన్ కు వినతిపత్రం అందజేశారు.నీటి కుళాయి ఇచ్చే వరకూ విజయరావు కుటుంబానికి తోడు గా వుంటామని చెప్పారు.

యోగాసనాల సాధనతో మెరుగైన జీవితం

విశాలాంధ్ర-ఏలూరు: యోగాసనాల సాధనతో మెరుగైన జీవనాన్ని పొందవచ్చని జిల్లా రెవిన్యూ అధికారి ఎవిఎన్ఎస్ మూర్తి తెలిపారు. బుధవారం వట్లూరు టిటిడిసి డిఆర్డిఏ హాలులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో 9వ ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎవిఎన్ఎస్ మూర్తి పాల్గొని మాట్లాడుతూ ప్రతిరోజు యోగాసనాల ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని తద్వారా జీవనాన్ని పొందవచ్చని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా యోగాదినోత్సవం జరుపుకుంటున్నారని ఇది మానవాళికి శుభపరిణామమని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రతినిత్యం యోగాను అభ్యసించాలని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించడానికి యోగాతో సాధ్యమని అన్నారు. పెద్దలు, యువత యోగాసనాలు నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు జిల్లా రెవిన్యూ అధికారి ఎవిఎన్ఎస్ మూర్తి జ్యోతి ప్రజ్వలనచేసి యోగాదినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులతో యోగా శిక్షణా మాస్టర్ వి. ధర్మారావు యోగాసనాలు వేయించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి విజయరాజు, ఆయూష్ సీనియర్ మెడికల్ ఆఫీసరు పివివిఎస్ఎన్ చౌదరి, డాక్టర్లు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - ఏలూరు : తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్యవేక్షక ఇంజనీర్‌వారి అధ్యక్షతన ఆర్.ఆర్.పేటలో గల విద్యుత్ భవన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అకౌంట్స్‌సిబ్బందితో సమీక్షా సమావేశం, ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పి. సాల్మన్ రాజు, పర్యవేక్షక ఇంజనీర్ సమీక్షా సమావేశం నిర్వ హిస్తూ విద్యుత్‌వినియోగదారులందరికీ 24 గంటలు విద్యుత్ సరఫరాచేయాలని, వ్యవసాయ విద్యుత్‌సర్వీసులు, కొత్త సర్వీసులన్ని వెంటనే రిలీజ్ చేయాలని తెలిపారు. లైన్ లాస్ లనుతగ్గించుటకు తగిన కృషిచేయాలని, విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని తెలిపారు. విద్యుత్ పరివర్తకాలు చెడిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆగిపోయిన, కాలిపోయిన మీటర్లను వెంటనే మార్చాలని తెలిపారు.

యోగాతో పరిపూర్ణమైన ఆరోగ్యం

విశాలాంధ్ర -కైకలూరు : ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చు అని సీనియర్ సివిల్ జడ్జి షణ్ముఖరావు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణంలో కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాదెం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగ ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. దీనివల్ల న్యాయవాదులు కోర్టు సిబ్బంది పలు విధాలైన యోగాసనాలు సాధన చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్ ఎస్ రాజు, సెక్రటరీ బి లక్ష్మణరావు, జాయింట్ సెక్రెటరీ చావలి శంకర్ శాస్త్రి, మహిళా ప్రతినిధి ఎండి రజిమున్నిసా, లైబ్రరీ సెక్రెటరీ కె. రమాదేవి, సీనియర్ న్యాయవాదులు పి. పవన్ కాంత్, ఎపిపి వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, ఏజిపిఎం పాములు, గురజాడ ఉదయ్ శంకర్, కే శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు హైస్కూల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-పెదపాడు: పెదపాడు జెడ్పి హైస్కూల్లో బుధవారం మండల స్థాయి లో ఆర్థిక అక్షరాస్యత పై ఆర్బిఐ అఖిలభారత క్విజ్-2023 ను నిర్వహించారు. పెదపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.బి.ఐ సమీకృత అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో జడ్.పి.హెచ్.ఎస్ వట్లూరు విద్యార్థులు పి. సాయి కనకదుర్గ ,కర్రీ కార్తీక్, సత్యవోలు జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు ఎల్. రోహిత్ రామ్, డి.ముత్తయ్య, వీరమ్మ కుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జి లహరి, జే పూజశ్రీ వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారన్నారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు 5000 ,4000 ,3000 రూపాయలు నగదు బహుమతులను, ధ్రువీకరణ పత్రాలను అందించడం జరిగిందని వెంకటేశ్వర రావు చెప్పారు. కార్యక్రమంలో పెదపాడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ ఎన్ రాకేష్, పెదపాడు, సత్య వోలు, వట్లూరు, వీరమ్మ కుంట, అప్పన వీడు, పాత ముప్పర్రు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన ధర్మరాజు పలువురికి పరామర్శ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన మేక శ్రీనివాసరావు ఇటీవల గుండెకి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనను బుధవారం ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ పత్స మట్ల ధర్మరాజు పరామర్శించారు.ధర్మరాజు వెంట చింతలపాటి బాసిరాజు ,తోట శ్రీను,గ్రామ పార్టీ అధ్యక్షుడు కొల్లేపల్లి దుర్గ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఉరాడల్ల వెంకటేశ్వరరావు, మనే సత్యనారయణ, కుంపట్ల జగదీష్,కార్యదర్శులు బొడపాటి రామయ్య, సంయుక్త కార్యదర్శులు మనే ప్రశాంత్, ఘంటసాల వెంకటరత్నం, బోడపాటి వెంకన్న, గ్రామ జనసైనికులు,తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహనా సదస్సు

విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని వేడంగి పెనుమదం గ్రామాలలో బుధవారం కౌలు రైతులకు రెండు రెవిన్యూ బృందాలు అవగాహన సదస్సులు జరిపాయి. బహుళ ప్రయోజనాలు కలిగిన కౌలు కార్డు లను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ కృష్ణారావు సూచించారు.మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జి. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ డి. రాజేష్, ఆర్ఐ రాంబాబు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు గ్రామ రెవిన్యూ అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు పడాల సత్యనారాయణ తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ప్రాముఖ్యత తెలియజేస్తూ బుధవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రముఖ యోగా గురువులు రాయల దుర్గా రావు, మోరుపాక సత్యనారాయణ చారిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా శారీరక మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆయన తెలిపారు.

శ్రీవాసవిలో అంతర్జాతీయ యోగ దినోత్సవం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విభాగం 1 మరియు 2వ యూనిట్లకు సంభందించిన విద్యార్థులు కళాశాల నుండి పెదతాడేపల్లి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ పలు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ర్యాలీని ప్రారంభించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు బిఎస్‌హెచ్ విభాగాధిపతి శ్రీ ఎన్. రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితునిగా విచ్చేసిన మాజీ సైనికాధికారి డి.వెంకటేశ్వర రావు యోగా గురించి అద్భుతమైన ప్రసంగం చేశారు, స్వయంగా పలు యోగా ఆసనాలను కూడా ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ కార్యదర్శి శ్రీ చలంచర్ల సుబ్బారావు, కోశాధికారి శ్రీ బాల కాశయ్య, టెక్నికల్ డైరెక్టర్ శ్రీ చెక్కా అప్పారావు, ఇంజనీరింగు కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరరాజు ఆయా ఎన్ఎస్ఎస్ విభాగాల కో ఆర్డినేటర్లు, వివిధ విభాగాల అధిపతులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా అవసరం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాయి ప్రియా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రరంలో యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగా మనిషి ఆరోగ్యానికి ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. యోగా చేయడం వలన శారీరక, మానసిక, ఉల్లాసము, జ్ఞాపక శక్తిని, చురుకుదనాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. అనంతరం జ్యోతుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రపంచానికి భారత్ అందించిన అతి గొప్ప బహుమతుల్లో యోగా కూడా ఒకటని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ గొల్లప్రోలు సైనికులు కొశిరెడ్డి రాజా, జిల్లా యోగ భారత్ ఫౌండేషన్, వ్యవస్థాపక అధ్యక్షులు, సాయిప్రియ సేవాసమితి అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్, సాయి ప్రియా సేవా సమితి చైర్మన్ జ్యోతుల గంగాభవాని, భారతి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకృష్ణ దేవరాయ వెంకట్రావు, యోగా అభిలాషులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా యోగా దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాంగణంలో గల ఇంజనీరింగ్, ఫార్మసీ, పోలిటెక్నిక్ మరియు బిజినెస్ స్కూల్ నందు ఆయా కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో యోగా వర్క్ షాప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో పసుమర్తి సీతారమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. సీతారాంను ప్రిన్సిపల్ డా ఆదిరెడ్డి రమేష్ ఘనంగా సత్కరించారు. ఫార్మసీ కళాశాలలో 72 ఏళ్ల యోగా శిక్షకుడు డాక్టర్ వి సత్యనారాయణ మూర్తి విద్యార్థులందరికీ యోగాను ప్రదర్శించారు. మరో అభ్యాసకుడు ఎస్.విష్ణు చక్రం శిక్షణలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆదిత్య మేనేజ్‌మెంట్ తరఫున ప్రిన్సిపల్ డా డి సతీస్‌కుమార్ ఇద్దరు కోచ్‌లను దుస్సలువాతో సత్కరించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌ల చేతులమీదుగా యోగాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డా ఎం శ్రీనివాసరెడ్డి, డా దోలా సంజయ్, డా కే రవిశంకర్, డా సంజయ్ కుమార్, ఎస్‌టివిఎస్ కుమార్ వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌లు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి మనిషి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలంటే యోగ తప్పనిసరిగా రోజుకి అరగంట పాటు చేయాలని రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్, శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం అధ్యక్షులు రుద్దరాజు వెంకట సూర్యనారాయణరాజు (ఆర్ వి ఎస్ రాజు) అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా వర్తక సంఘ భవనంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ యోగ కార్యక్రమం ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ వి ఎస్ రాజు మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల క్రితం భారత ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మొదలుకొని గ్రామ గ్రామాల్లో కూడా ఈ యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపాటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలతో యోగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-పెదపాడు: సామాన్యుని నుంచి శాస్త్రవేత్త వరకు నయా పైసా ఖర్చు లేకుండా యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని పెదపాడు జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ యోగ దే సందర్భంగా బుధ వారం పాఠశాలలో విద్యార్థులచే యోగ సాధన చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వెంకటేశ్వర మాట్లాడుతూ యోగ భారతదేశపు పురాతన ఆరోగ్య రహస్యం అన్నారు. యోగా సాధకులు తమ మనస్సును ఏకోన్ముఖం చేసి ప్రాణాయామం, ధ్యానం లను అభ్యాసం చేస్తే శరీర ఆనందంతో పాటు ఆత్మానందం పొందవచ్చునని అన్నారు. యోగాసనాలు వేసే ముందు తగిన జాగ్రత్తలు పాటించాలి అన్నారు. ప్రపంచీకరణ కారణంగా జీవనశైలి మారుతున్న నేపథ్యంలో శారీరిక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగ ఓ అద్భుతమైన సాధనం అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా మార్చుకుని ఆనందంగా ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణకు భారతీయ సంస్కృతి నుంచి లభించిన అమూల్యమైన బహుమతి యోగ అన్నారు. విద్యార్థులు యోగాను ప్రతిరోజు చేసి ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ కె విజయ, ఫిజికల్ డైరెక్టర్లు నాయుడు, సునీల్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్‌లో : యోగాతో చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. ఏపీ నిట్ లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రాంగణంలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతదేశానికే దక్కుతుందన్నారు. నిత్యం యోగ చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్, ఆచార్యులు వి.సందీప్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ రాముడు, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ జగన్ మోహనరావు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్యారాణి, బీటెక్, ఎంటెక్, పీహెచ్ డి విద్యారులు పాల్గొన్నారు.

పోడూరులో : 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలం లోని జిన్నూరులో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బుధవారం యోగ దినోత్సవం జరిపారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ ఎన్ గిరీష్ 400 మంది విద్యార్థులతో వివిధ యోగాసనాలు వెయ్యించారు ప్రతీ రోజు యోగాసనాలు వేస్తూ అనారోగ్యం రాకుండా కాపాడుకోవాలని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని సూచించారు. అనంతరం మెయిన్ రోడ్డులో విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు, ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయులు జమ్ము రామలక్ష్మణరావు ఆయుర్వేద డిస్పెన్సరీ ఎంఎన్ఓ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యలో అంతర్జాతీయ సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలేం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఐ ట్రిపుల్ ఇ వైజాగ్ బే సెక్షన్‌తో కలిసి జూన్ 23-24, తేదీల్లో అడ్వాన్స్‌డ్ & గ్లోబల్ ఇంజనీరింగ్ ఛాలెంజెస్ (ఏజీఇసి)పై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా ఎన్ సతీష్ రెడ్డి తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ "ఏజీఇసి-2023" ఆధునిక సైన్స్ & టెక్నాలజీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థాయి పరిశోధన & తాజా ఆవిష్కరణలను సహకరించడానికి మరియు ప్రదర్శించడానికి విద్యార్థులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు & శాస్త్రవేత్తలకు అద్భుతమైన అంతర్జాతీయ వేదికగా ఉంటుందని. ఈ సదస్సు యొక్క ప్రధాన ఇతివృత్తం "సుస్థిర అభివృద్ధి కోసం తదుపరి తరం సాంకేతికత".అని వివరించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - బిక్కవోలు : తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక శ్రీ పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో సామూహిక యోగ కార్యక్రమం పాఠశాల వ్యాయామదర్శకులు లయన్ ద్వారంపూడి యువ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తాడి జయ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ప్రార్థనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రాణాయామాలు యోగాసనాలు సూర్య నమస్కారాల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులచే వ్యాయామ దర్శకులు యువ రాజారెడ్డి చేసి చూపిస్తూ విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా యువరాజా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో బిజీగా మారుతున్న జీవన విధానంలో యోగా ద్వారా మానవుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పి జి టి ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్, హై స్కూల్ ఎలిమెంటరీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అనపర్తిలో: యోగా రోజువారీ జీవితంలో సమతుల్య వైఖరిని కొనసాగించే మార్గాలను పెంపొందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఇంటర్నేషనల్ యోగా దే సందర్భంగా స్థానిక జిబిఆర్ యోగ క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 365 రోజులు క్రమం తప్పకుండా యోగ చేసిన పెద్ద రాజు ను ఎమ్మెల్యే గోల్డ్ మెడల్, శాలువాతో సత్కరించగా యోగా క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ఎస్), తేతలి త్రినాధ రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి (లెఫ్ట్), నల్లమిల్లి సాయి రామారెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ కర్రి సునీల్ రెడ్డి, సత్తి రామారెడ్డి, సిఐ విప్పర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో : శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమంలో ఇంటర్నేషనల్ యోగా డే యోగా గురువు, ఆయుర్వేదం ఫిజియోథెరపీ వైద్యుడు యోగా శ్రీనివాస్ అధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా అనగా మన మానవులకు దేవుళ్ళు ఇచ్చిన వరం, ఆ వరాన్ని పొందిన మనం ప్రతిరోజు యోగాసనాలు చేస్తూ మన ఒంట్లో ఉన్న వ్యాధుల్ని తగ్గించి ఏ వ్యాధి రానివ్వకుండా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించొచ్చునని అన్నారు. యోగాసనాలు చేస్తే మన ఒంట్లో బ్లడ్ సర్క్యులేషన్ బాగా అయి, కీళ్ల నొప్పులు, బీపీ షుగర్, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, గుండెకి సంబంధించిన వ్యాధులు, కిడ్నీకి సంబంధించిన వ్యాధులు, మన బాడీలో ఉన్న అవయవాలు అవయవాలకి ఏ వ్యాధి రానివ్వకుండా కాపాడేదే యోగా అన్నారు.

కొత్తపేటలో : స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొత్తపేటలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్. అరుణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ కె. కనకరాజు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ కుంచే పెద్దిరాజు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. దైనందిన జీవితంలో యోగ మెడిటేషన్ ఎక్సర్సైజులు తప్పనిసరిగా చేయాలని, నడక, వ్యాయామం వలన మనిషి జీవన ఆయుష్షు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డిసిహెచ్ పాపారావు, కెఅంకమ్మరావు, కే సత్యనారాయణ, టి రమాదేవి, శివాజీ, శ్రీలక్ష్మి, విజయ్ కుమార్, నాగరాణి, భవాని, పవన్, ప్రసన్న జ్యోతి, సాయి కృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోటలో: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో ఆయుష్ ఆయుర్వేద కేంద్రంలో ఆయుర్వేద వైద్య అధికారి డాక్టర్ షాహాజద్ అలీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అలీ మాట్లాడుతూ యోగాతో ఆత్మస్థైర్యం, ఆరోగ్యం, ఆనందం పొందవచ్చని యోగాతో అనేక రుగ్మతలను నివారించవచ్చునని అన్నారు. యోగ అధ్యాపకులు మామిడి లక్ష్మణ్ కుమార్, మందా జగదాంబ విద్యార్థులతోనూ హాజరైన ప్రముఖులతోనూ యోగాసనాలు, ప్రాణాయము, ధ్యానము చేయించి వాటి వల్ల ఉపయోగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరంరెడ్డి చిన్నబాబు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్ లక్ష్మణరావు, మరియు సచివాలయ సిబ్బంది, ఆయుష్ వైద్య సిబ్బంది ఎన్ చంటిబాబు, కాటన్ దొర, రాజశేఖర్, భాను, గ్రామ ప్రజలు విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

అనపర్తిలో :స్థానిక జిబిఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ పి ఆర్ ఎల్ స్వామి, ఎన్ పి అబ్బాయి రెడ్డి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగా అభ్యసనంతో మానసిక, శారీరక ఆరోగ్యం దృఢపడుతుందని తెలిపారు. ట్రైనర్ నవీన్ ఆధ్వర్యంలో పలు రకాల యోగాసనాలు వేయించడం జరిగింది ఎన్ఎస్ఎస్ జూనియర్, డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్లు పి వి వెంకటేశ్వరరావు, సి హెచ్ ఆనందరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్ రాజు, జీవన్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి ఆశయాలు నెరవేరేలా మానవత సభ్యులు కృషి చేయాలని మానవత జిల్లా కన్వీనర్ బోయపాటి రామలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని పాలంగి మానవత ఉండ్రాజవరం కార్యాలయ భవనం వద్ద నిర్వహించిన మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్న వారిని మానవత వెంటనే ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 2023-24 సంవత్సరానికి గాను ఉండ్రాజవరం మండల శాఖ అధ్యక్షునిగా కడలి మాణిక్యాల రావు, ఉపాధ్యక్షులుగా కతారి సిద్ధార్థ రాజు, సుంకవల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి, వి వి ఎస్ ఎన్ ప్రసాద్, కోశాధికారి, జాయింట్ సెక్రటరీ గా కంటిపూడి లక్ష్మీపతి లు, ఈసీ సభ్యులుగా కోడూరి శ్రీనివాసరావు, అయిశెట్టి విజయరావు, మన్నే శ్రీనివాసరావు, ఉన్నమట్ల శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వెలిచేటి బోసు, పూర్వపు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోడీ 9 ఏళ్ల పాలనపై ప్రచారం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రపంచంలోనే యోగాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనుడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని తూర్పుగోదావరి జిల్లా బీజేపీ ఇన్‌చార్జి కృష్ణా భగవాన్ అన్నారు. దేశప్రధానిగా మోడి పగ్గాలు చేపట్టి 9ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోడీపాలన, పేదల కోసం అందించిన సంక్షేమాలపై బీజేపీ నేతలు మండల కేంద్రమైన రాజానగరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యోగా డే ప్రపంచ వ్యాప్తంగా 175 దేశాల మద్దతు ఇచ్చాయని, అందుకు మన ప్రధాని మోడీ అందించిన కృషిని కొనియాడారు. జిల్లా కోశాధికారి అడబాల గణపతిరావు మాట్లాడుతూ నేటి సమాజానికి యోగ ఒక దివ్య ఔషధం లాంటిదన్నారు.అనంతరం చక్రద్వారబంధం గ్రామంలో ఇంటింటికి స్టిక్కర్లు అంటించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ సంగిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా బీజేపీ విస్తారక్ శివాజీ, జిల్లా మహిళా మోర్చా కన్వీనర్ రజిని, మండల అధ్యక్షులు పేపకాయలు కాశీ, జిల్లా సెక్రెటరీ బోయిడి దుర్గారావు,మండల ఉపాధ్యక్షులు సంగిశెట్టి సత్యనారా యణ, అసెంబ్లీ ఐటీ సెల్ కన్వీనర్ అల్ల శివ నాగరాజు, కోరుకొండ మండల ప్రధాన కార్యదర్శి సత్తిరాజు సుబ్రహ్మణ్యం,తదితరులు పాల్గొన్నారు.

యోగతో మానసిక వికాసం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రతిరోజు యోగ సాధన చేయడం ద్వారా శారీరక అభివృద్ధి,మానసిక వికాసం పొందవచ్చు నని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంతర్జాతీయ 9వ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కుని మండలంలోని వివిధ విద్యాసంస్థలు నందు యోగ దినోత్సవ వేడుకలు బుదవారం ఘనంగా నిర్వహిం చారు. దీనిలో భాగంగా నన్నయ్య వర్సిటీ నందు కానవరం రాపర్తి రామ యోగ ఇనిస్టిట్యూట్ కి చెందిన డాక్టర్.ఎంవిజీఎస్ శర్మ, ప్రిన్సిపాల్ ఎన్.శివ శంకర్, యోగ టీచర్ కె.అప్పలరాజు ఆధ్వర్యంలో యోగాసనా లపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో కూడా యోగా పై వివిధ కోర్సులు ప్రవేశపెడతామని విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆచార్య ఎస్.టేకి స్మారక ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎస్ఎల్ వైద్య కళాశాలలో :యోగ క్రమం తప్పకుండా చెయ్యడం ద్వారా మానసిక ఒత్తిడికి దూరం కావచ్చునని జిఎస్ఎల్ వైద్య కళాశాల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. అంతర్జాతీయ 9వ యోగా దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రగణంలో బావి వైద్యులతో కలిసి యోగ తరగతులు నిర్వహించారు.

గైట్ కళాశాలలో :అంతర్జాతీయ తొమ్మిదవ యోగ దినోత్సవం సందర్భంగా గైట్ ప్రాంగణంలోని వివిధ కళాశాలలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గోదావరి విద్యాపీఠం స్కూల్ :మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని గోదావరి విద్యాపీఠం స్కూల్ నందు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సేవా ఉగాది ఆధ్వర్యంలో యోగా గురువులు ఎం.వి.వి.రమణ అధ్యక్షతన వివిధ యోగ పోటీలు నిర్వహించారు.

టిడ్కో ఇళ్ళు లబ్దిదారులకు అందించకుంటే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మ అధ్యక్షతన పిఠాపురం టౌన్ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిఠాపురం పట్టణ టౌన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు మొదలు పెడుతున్నామని తెలియజేసారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు తక్షణమే లబ్దిదారులకు అందజేయాలని సూచించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు అన్ని సౌకర్యాలతో కూడిన టిడ్కో అపార్ట్ మెంట్స్ సుమరుగా 1000 కుటుంబాలకు కేటాయించారని, ఈ ప్రభుత్వం వచ్చాక కక్షపూరితంగా వ్యవహరిస్తూ కోపంతో నేటికి లబ్దిదారులకు అందజేయకుండా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డం భాస్కరరావు, కొండేపూడి సుర్యప్రకాష్, కోరుప్రోలు శ్రీను, సోము సత్యనారాయణ, సురవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి మారటం లేదు

ఎటూ తేలని మున్సిపల్ వివాదం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం మున్సిపాలిటీలో గత వారం జరిగిన కొట్లాట ఎటూ తేలకుండా అయోమయంలో పడింది. ఆదివారం మంత్రి సమక్షంలో జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. వివాదాన్ని సర్దుబాటు చేయాల్సిన మంత్రి మిన్నకుండటం పై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే మొత్తం వ్యవహారం ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణకు అప్పగించడంతో మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకోవడం లేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మున్సిఫల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి రాజీనామా పై రేగిన ఉత్కంట కొనసాగుతోంది. అయితే చైర్మన్ రాజీనామా చేస్తారు అనడంతో ఆశవాహులు బయటకు వచ్చేసారు. తాము చైర్మన్ అంటూ మొదలు పెట్టేసారు. ముఖ్యంగా 15 వార్డు కౌన్సిలర్ వాసర్ల లక్ష్మీ పేరును ఒకరు ముందుకు. తీసుకు రాగా మంత్రికి భద్ద శత్రువుగా వ్యవహరిస్తున్న వాసంశెట్టి సుభాష్‌కి సన్నిహితంగా ఉండే వసర్ల కుటుంబానికి ఇచ్చే ప్రసక్తే వుండదంటున్నారు.

తన భార్యకు ఇవ్వాలని దొంగ చిన్నా పట్టుబడుతున్నారు. గతంలోనే తెరమీదకు వచ్చిన సుంకర పార్వతి పేరు మరోసారి వినిపిస్తోంది. అసలు చైర్మన్ రాజీనామా చేస్తారా అనేది సస్పెన్సు. నాలుగేళ్ల కాల పరిమితి పూర్తి అయితే గాని చైర్మన్ పై అవిశ్వాసం పెట్టడం కుదరదని చట్టం చెబుతుంది. పార్టీ ఆదేశిస్తే ఆమె రాజీనామా చేస్తోందా. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న ఈ తరుణంలో ఇటువంటి మార్పులకు అధిష్టానం ఒప్పుకుంటుందా. కేసు నమోదు చేయడానికి కూడా వీలు లేని సంఘటనను పట్టుకుని చైర్మన్ రాజీనామా చేయమనడం ఎంతవరకు సమంజసం అని ఆమె వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద మున్సిపల్ రాజకీయం రసకందాయంలో పడనుంది.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో శ్వాసకోశ నాళాలకు సంబంధించిన అనారోగ్యంతో మరణించిన రాజమండ్రపు శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఎంపీపీ తోట రవి, పరామర్శించి, ప్రభుత్వం అందజేసిన వైఎస్ఆర్ బీమా పథకం చెక్‌ను ఆయన చేతుల మీదుగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవరం సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, జగ్గంపేట మార్కెట్ కమిటీ ఎఎంసి డైరెక్టర్ తోట విష్ణు, వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయ, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.